
ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి


కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..


గతుకులమయంగా హెచ్‌బీ కాలనీకి వెళ్లే రోడ్డు

రోడ్లన్నీ గోతులే..

- శిథిలమైన అంతర్గత రహదారులు
- తరచూ ప్రమాదాలు
- వాహనచోదకుల అవస్థలు


హౌసింగ్ బోర్డు కాలనీలో గోతులమయమైన సీసీ రోడ్డు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులో రోడ్లు గతుకులతో నిండి, ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. చిన్న వాన కురిసినా కాలనీలోని అంతర్గత రహదారులు జలమయం అవుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లో నివసించేవారు నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నారు.

స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి హెచ్‌బీ కాలనీకి వెళ్లే రోడ్డు మలుపు వద్ద సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అక్కడంతా గోతులమయంగా ఉండడంతో ఆ రహదారిలో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు.

ఇప్పటికీ కచ్చారోడ్డే..

కారుషెడ్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. దశాబ్దాలుగా కచ్చారోడ్డుగానే మిగిలి పోయింది. వర్షం కురిస్తే ఈ రోడ్డులో ప్రయాణించలేమని, ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా గండమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది.
- హెచ్‌పీ కాలనీలోకి వెళ్లే సీసీ రోడ్డు గతుకులమయంగా ఉంది. ఈ కాలనీలోని రోడ్డు మలుపులో ఏర్పడిన గుంత కారణంగా ద్విచక్రవాహనంపై ఆ రోడ్డులో వెళ్లేవారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- 80 అడుగుల రోడ్డు నుంచి ముస్లిం కాలనీకి వెళ్లే రోడ్డులో రాళ్లు పైకి తేలిపోయాయి.

ఇప్పటికైనా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి, కాలనీల్లోని అంతర్గత రహదారులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


హెచ్‌పీ రోడ్డు మలుపులో ప్రమాదకరమైన గుంత

వాన పడితే ఇళ్లలో ఉండాల్సిందే..



చిన్న వర్షం కురిసినా కాలనీలో రోడ్లన్నీ చెరువుల్లా అయిపోతున్నాయి. నీరు తగ్గాక చిత్తడి మారిపోవడంతో అడుగు వేయాలన్నా భయమే. దీంతో వానొస్తే ఇళ్లలోనే ఉండిపోతున్నాం. వాకింగ్‌కు వెళ్లేవారు ఎక్కడ జారిపడతారో అని భయం. చీకటి పడితే మా రోడ్లలో ప్రయాణించలేం. అధికారులు స్పందించాలి. రోడ్లు పునరుద్ధరించాలి.

– జ్యోతికమల, వనితా వాకర్స్ అధ్యక్షురాలు, పీఎం పాలెం

రాత్రివేళ తరచూ ప్రమాదాలే..



కాలనీల్లో రోడ్లన్నీ శిథిలమైపోయాయి. రాత్రి వేళ ఈ రోడ్లలో ద్విచక్రవాహనంపై ప్రయాణించాలంటే చాలా భయం. ఎక్కడ ఏ గోతిలో పడిపోతామో అని భయంభయంగానే ప్రయాణిస్తాం. హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్లను బాగు చేయాలి.

– పోతిన సన్యాసిరావు, పీఎం పాలెం

అరటిపండ్ల అలంకరణలో రాస పోలమాంబ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవా రం 2వేల అరటి పండ్లు, బంతి పువ్వులు, తుల సిమాలలతో అలంకరించారు. మజ్జివలస రెడ్డి వారి కళ్లాలకు చెందిన పల్లి అప్పన్న, గురమ్మ దంపతులు ఈ అలంకరణ కు సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

బీచ్ రోడ్డులో షూటింగ్ సందడి


లొకేషన్‌లో నటి అన్ను

కొమ్మాది: బీచ్ రోడ్డులో మంగళవారం సాయంత్రం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. నటి అన్ను అంబానీ (మన్మథుడు ఫేమ్)పై బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిత్రంలో హీరోగా సందీప్ కిషన్, హీరోయిన్ రీతు వర్మ నటిస్తున్నారు.

క్లుప్తంగా

రక్షణ దళాల్లో పెరుగుతున్న మహిళల సంఖ్య


ప్రసంగిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్

కొమ్మాది: దేశంలో రక్షణ దళాల్లో చేరే మహిళల సంఖ్య క్రమేపీ పెరుగుతోందని లెఫ్టినెంట్ కల్నల్ వై.హెచ్.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ పూర్తి చేసిన యువతరం దేశసేవకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గీతంలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజస్థాన్, బిహార్, జమ్మూ కాశ్మీర్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి గీతంలో ప్రవేశం పొంది, ఎన్‌సీసీలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులను ఆయన అభినందించారు. భారత నౌకాదళం వాయు సేనలో ఎంపిక కావాలంటే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ముఖ్యంగా గణితం, భౌతిక శాస్త్రాల్లో పట్టు ఉండాలని తెలియజేశారు.

న్యాయవాదులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేయించుకుంటున్న న్యాయవాదులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లారెన్స్ అండ్ మయో సహకారంతో కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జడ్జి నాగేశ్వరరావు ప్రారంభించారు. న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి కె.ఎస్.ఎం.సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నీ



మాట్లాడుతున్న ఏబీసీ కార్యదర్శి నరేంద్రకుమార్

భీమునిపట్నం: భీమిలిలోని అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ (ఏబీసీ) ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు నియోజకవర్గ స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్ తెలిపారు. భీమిలి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నీలో 14జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. త్వరలో జూనియర్లకు ఈ పోటీలను నిర్వహించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీసీ సహాయ కార్యదర్శి అడిదం కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ


శిక్షణ తరగతులకు హాజరైన మహిళలు

పీఎం పాలెం: స్థానిక సత్యసాయి సేవాసమితి, మారికవలస సాయి సెంటర్ సౌజన్యంతో మహిళలకు టైలరింగ్, సోప్‌ల తయారీలో నైపుణ్య వృద్ధి శిక్షణ ఇచ్చారు. స్థానిక సాయి ప్రేమాలయంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సహకారంతో హెల్త్ అండ్ హైజీన్‌పై అవగాహన, ప్రకృతి విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని స్థానిక సాయి సమితి కన్వీనర్ ప్రభాకర్ పర్యవేక్షించారు.

బులివెంద గెడ్డను మాయం చేస్తున్నారు

- టీడీపీ నాయకుల ఆక్రమణల పర్వం
- ముంపు ముప్పుపై గ్రామస్తుల్లో ఆందోళన


కొత్తగా తవ్వుతున్న కృత్రిమ గెడ్డ

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీలో స్థానిక టీడీపీ నాయకులు సుమారు 3 కిలోమీటర్ల మేర పొడవైన బులివెంద గెడ్డను మాయం చేస్తున్నారు. సర్వే నంబర్ 39/4లో ఎగువ పాలవలస ఎర్ర చెరువు నుంచి దిగువ పాలవలస వైపు 10 అడుగుల వెడల్పు 12 అడుగుల లోతు గల గెడ్డను పూడ్చి అందులోని తమ సొంత భూములకు రోడ్డు నిర్మించుకుంటున్నారు.

శ్మశానవాటిక గెడ్డగా పిలుచుకునే దీని పక్కనుంచి 2014లో పంచాయతీ పాలక వర్గం రూ.15 లక్షల ఉపాధిహామీ నిధులతో సుమారు 500 మీటర్ల మేరకు శ్మశానవాటికకు రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు ఈ రోడ్డును తవ్వేసి, గెడ్డను పూడ్చేసి ప్రత్యామ్నాయంగా పిల్ల కాలువ లాంటి గెడ్డను తవ్వి, శ్మశానవాటికకు కాలిబాటలు వదులుతామని పంచాయతీలో బీభత్సకరమైన వాతావరణం సృష్టిస్తున్నారు. దీంతో పంచాయతీవాసులు గెడ్డ ఆక్రమణను ఆనందపురం తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లి, వినతిపత్రం అందజేశారు. ప్రకృతి సిద్ధంగా వందల ఏళ్ల నుంచి ఉన్న గెడ్డను పూడ్చేస్తే చెరువులోకి వెళ్లవలసిన వర్షం నీరు గ్రామాలను ముంచేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పాలవలసలో జేసీబీతో గెడ్డను పూడ్చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో దాదాపు కోటిన్నర విలువ చేసే సుమారు 300 గజాల ప్రభుత్వ భూమి వద్ద అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిని కబ్జా చేసేందుకు ఇద్దరు పక్కా స్కెచ్‌తో ముందుకు వెళ్తున్నారు. దీనిపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా, రెవెన్యూ అధికారులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. దీనిపై 'కోటిన్నర స్థలం కొట్టేసేందుకు స్కెచ్' శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌ఐ కిషోర్ స్పందించారు. స్థల పరిరక్షణ చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రుషికొండలోని సర్వే నంబర్ 17/1, 2, 5 లో భూముల ఆక్రమణలను కూడా పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

కుంతీ మాధవస్వామికి పవిత్రాల సమర్పణ




ఆలయంలో పవిత్రాల అలంకరణలో ఉత్సవ మూర్తులు, కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉత్సవ మూర్తులకు, కుంతీ మాధవ స్వామికి పవిత్రాలు సమర్పించారు. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యావచనం నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి, అనంత పద్మనాభ స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. నిత్య హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి, తిరుమంగళ్వారు, గోదాదేవి, లక్ష్మీదేవి, కుంతీ మాధవ స్వామిలకు పవిత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్రినాయుడు, తాలాడ పైడిరాజు, రామసింగి సన్యాసిరావు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలు, వసతిగృహాల సందర్శన


భీమిలి మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్డీవో సంగీత్ మాథుర్

తగరపువలస: భీమిలి మున్సిపల్ హైస్కూల్‌ను ఆర్డీవో సంగీత్ మాథుర్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వారికి సూచనలు చేశారు.

ఎంపీడీవో హాస్టల్ సందర్శన

ఎంపీడీవో హనుమంతరావు చేపలుప్పాడ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు, భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు.

రెడ్డిపల్లి సచివాలయం తనిఖీ

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు, సెలవు, మూమెంటు రిజిస్టర్లు, క్యాష్ బుక్‌ను పరిశీలించారు. రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.

ఆలయానికి స్టీల్ కంచాల వితరణ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రతివారం జరిగే అన్నదానానికి గాను డాక్టర్ పద్మావతి నాయుడు మంగళవారం 50 స్టీల్ కంచాలు అందించారు. వీటిని ఆలయ కమిటీ సభ్యులు చేట్ల త్రినాధ రెడ్డి, నందిక రమణ, మేకల శ్రీను తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు.

ఘనంగా బంగారమ్మ అనుపు ఉత్సవం


బంగారమ్మ ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్దిలో బంగారమ్మ అనుపోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో చిడతలు, పులివేషాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాస రావు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక


రూపొందించిన నమూనాతో విద్యార్థులు

మధురవాడ: ఫ్యూచర్ ఆన్ –2024 జోనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో మధురవాడ సీవోఈ విద్యార్థులు రూడా ఇవాంజలిన్, ప్రవల్లిక, సాయిప్రియ రూపొందించిన నమూనా ప్రథమ స్థానంలో నిలిచింది. కొమ్మాది రిక్షాకాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వేదికగా జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శనలో సీనియర్స్ ఐసీటీ విభాగంలో ఐవోటీ బేస్డ్ కార్ పార్కింగ్ సిస్టం నమూనా రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

వైజాగ్ బౌన్సర్స్ టీ షర్ట్ ఆవిష్కరణ


టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న నటుడు రావు రమేష్

కొమ్మాది: ఈవెంట్స్, షూటింగ్స్‌లో బందోబస్తు కోసం వచ్చే బౌన్సర్ల విధి నిర్వహణ చాలా కష్టంతో కూడిందని ప్రముఖ నటుడు రావు రమేష్ అన్నారు. వైజాగ్ బౌన్సర్స్ వాసు టీమ్ లోగోతో ఉన్న టీ-షర్ట్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైజాగ్ బౌన్సర్స్ అధ్యక్షుడు వాసు, సభ్యులు అవతార్ సింగ్, సాగర్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి శాస్త్రి, ఎంఈవో బాబూలాల్

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఎండీఎం జిల్లా మానిటరింగ్ అధికారి జె.ఎస్.శాస్త్రి, ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. పథకం నిర్వహణపై ఎండీఎం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలని ఆయాలను ఆదేశించారు.

ఉపాధ్యాయులకు అభినందన



ఓపెన్ స్కూల్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ గోపీకృష్ణ

తగరపువలస: ఓపెన్ స్కూల్‌కు సంబంధించి జిల్లాలో అత్యధిక అడ్మిషన్లు చేసిన ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను అమరావతికి చెందిన సొసైటీ సూపరింటెండెంట్ గోపీకృష్ణ అభినందించారు. పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా మిగిలిన పాఠశాలల్లోనూ అడ్మిషన్లు వేగవంతం చేయాలని కోరారు. అడ్మిషన్లు పెంపునకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఓపెన్ స్కూల్ మార్గదర్శకాలపై కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ కో ఆర్డినేటర్లు మురళీమోహన్, జయవర్మ, ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో మంగళవారం విజన్ ట్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ద్వారా ఆరోగ్యవంతమైన భారతదేశం అనే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మధు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యకరమైన జీవనశైలి కారకాలు మన నియంత్రణను దాటిపోతున్నందున విద్యార్థుల కళ్ల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సరైన పోషకాహారం, రెగ్యులర్ తనిఖీలు, కంటి చూపు మెరుగుపరచే వ్యాయామాల ద్వారా కళ్లు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటాయన్నారు. విటమిన్ ఏ, సీ, జింక్, ఒమేగా 3 కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కంప్యూటర్ స్క్రీన్, సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉండే చిట్కాలు పాటించాలన్నారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు


భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప మాలధారులు

పీఎం పాలెం: అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల కు స్థానిక లక్ష్మీవానిపాలెంలోని కమ్యూనిటీ హాల్లో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మాలధారులు అన్నప్రసాదం స్వీకరించారు. స్థానిక పరశురామ గురుస్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రోజూ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

నారాయణరాజుపేటలో పారిశుద్ధ్య పనులు

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేటలో పారిశుద్ధ్య సిబ్బంది మంగళవారం శుభ్రతాచర్యలు చేపట్టారు. ఇటీవల జల్‌జీవన్ పనుల నిర్వహణలో భాగంగా పంచాయతీ మధ్యలో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో పంచాయతీ వాసులు ఎంపీడీవో హనుమంతరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది, అనంతరం ఆరోగ్య సిబ్బంది స్థానికుల ఆరోగ్యంపై ఇంటింటి సర్వే చేపట్టారు. జ్వరాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వరస్వామి పీఠంలోని అన్నపూర్ణా సమేత సిద్ధేశ్వర దేవి సహిత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి దేవాలయంలో నందీశ్వరుడికి, శివుడికి మంగళవారం సాయంత్రం ఏకకాలంలో పూజలు చేశారు. అమావాస్య ముందు వచ్చే త్రయోదశిని పురస్కరించుకుని ఈ పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

'పీఎం కిసాన్ నిబంధనలు సవరించాలి'

తగరపువలస: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పాత మార్గదర్శకాలనే కొనసాగించడం వలన లక్షలాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందడం లేదని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న అన్నారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోదీకి మంగళవారం లేఖ రాశారు. పేద, మధ్య తరగతి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిబంధనలు సవరించి, అర్హత గల ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.